ఆంధ్రప్రభ వారపత్రిక - జూలై 12, 1967

పెళ్ళి అంటే వ్యక్తిత్వం నాశనం కాదు.
కొత్త వ్యక్తిత్వం ఆవిర్భావం

పెళ్ళి చేసుకో

కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులు అగ్నిహోత్రానికి ప్రదక్షిణం చేస్తున్నారు. అంటే అగ్నిసాక్షిగా వివాహం జరిగిపోతూందన్నమాట!

ఆ దృశ్యం చూస్తూంటే రాజారావు మనస్సు గతాన్ని తవ్వసాగింది. ఏవేవో మధుర భావనలు అతన్ని ఉరకలెత్తించాయి. అక్కణ్ణించి అతను తక్షణం లేచి వెళ్ళిపోయాడు.

పెళ్ళి వేడుకలను పారవశ్యంతో చూస్తూ, మధ్య మధ్య తనూ రెండు ఛలోక్తులు విసురుతూన్న వసుంధరకు ఉన్నట్లుండి భర్త గుర్తుకు వచ్చాడు. ఆమె అటూ ఇటూ చూసింది. రాజారావెక్కడా కనిపించలేదు. "ఏమైపోయారు చెప్మా!" అనుకుంటూ అక్కణ్ణించి లేచి విడిదిగృహానికి వెళ్ళింది ఆమె.

జనమంతా పెళ్ళి చూడ్డానికి వెళ్ళిపోయిన మూలాన విడిదిగృహం పలచగా ఉంది. రాజారావు మాత్రం వీధి అరుగుమీద కూర్చుని కాగితాల మీద ఏవేవో చకచక రాసేస్తున్నాడు.

వసుంధర భర్త ముఖాన్ని చూసి నవ్వుకుంది. ఏకాగ్రతలో ఉన్నప్పుడాయనకు ఎదట ఎవరున్నదీ తెలియదు! పరిసరాలతో సంబంధం లేదు. అలా రాసుకుపోతుంటారు. ఆ సమయంలో అతని ముఖం చూడడానికి ఆమెకెంతో ముచ్చటగా ఉంది.

రాజారావు తలెత్తి చూసేసరికి ఏకాగ్రతతో తన వంకే చూస్తున్న వసుంధర కనిపించింది. "అరే, నీవెప్పుడు వచ్చావు, వసూ?" అన్నాడు.

"వచ్చి గంటేనా అయి ఉంటుంది. కానీ ఏమండీ, ఏమిటండీ మీరు రాస్తున్నది?"

"ఇదా? ఇది యువకులందరినీ పెళ్లి చేసుకోమని ప్రబోధించే కథ. పెళ్లి అంటే ఏదో గుదిబండ తగిలించుకోవడమనే అభిప్రాయంలో ఉండేవాళ్ల దురభిప్రాయాల్ని తొలగించి, పెళ్ళిలో జరిగే మధుర సన్నివేశాలను వాళ్ళకి తెలియపరచి ఆవేశాన్ని కలిగించాలని వ్రాస్తున్న కథ, వసూ!"

"అలాంటి కథ రాయాలని మీకెందుకనిపించిందండీ అసలు?"

"మన పెళ్ళి అయినప్పటినించీ రాయాలని ఉంది, వసూ. కానీ ఈ రోజు ఈ పెళ్ళి చూస్తూంటే నాకు సరి అయిన ఆవేశం కలిగింది. చాలా భాగం రాసేశాను."

"ఏదీ, నన్ను చూడనీండి" అంటూ వసుంధర అతని దగ్గిరనుంచి పుస్తకం తీసుకుంది.

"ఇదంతా మన పెళ్ళివేడుకే. ఉత్సాహభరితమైనవీ, విచిత్రంగా ఉండేవీ కొన్ని సన్నివేశాలు మాత్రమే తీసుకురాశాను. నువ్వు చదువుతూంటే వినాలని కోరికగా ఉంది. చదువుతావా?"

ఆమె సిగ్గుపడింది.

"అలా వీల్లేదు. చదవాలి, వసూ – నెమ్మదిగా చదువు. నువ్వు చదువుతూంటే ఎంత మధురంగా ఉంటుందో తెలుసా?"

వసుంధర ఎక్కువగా బ్రతిమాలించుకోకుండానే అతని పక్కనే కూర్చుని నెమ్మదిగా చదవడం మొదలు పెట్టింది. అతను కుర్చీలో వెనక్కి చేరగిలబడి అరమోడ్పుకన్నులతో వినసాగాడు.

✦ ✦ ✦

"అన్నయ్య వచ్చేశాడేవ్, అమ్మా!" అంటూ శంకరం చిన్నతమ్ముడు గోపీ లోపలికి పరిగెత్తాడు. రామలక్ష్మి అన్నయ్య వంక అదోలా చూసి నవ్వింది. శంకరం కొంటెగా నవ్వాడు చెల్లెల్ని చూసి.

"అమ్మాయ్, అన్నం వార్పుకి వచ్చింది. కొంచెం చూస్తూ ఉండమ్మా" అంటూ పార్వతమ్మ మండువాలోకి పరిగెత్తుకువచ్చింది. కోడలు సుందరి అత్తగారి ఆజ్ఞల నెన్నడూ అతిక్రమించి ఎరగదు. వార్పుకి వచ్చిన అన్నాన్ని అలా చూస్తూ ఉండిపోయి, నయనం మినహాగా సర్వేంద్రియాలనూ మండువావైపు కేంద్రీకరించింది ఆమె!

"ఏరా, ఏమన్నారు వాళ్ళు?"

రామలక్ష్మిని చూసి నవ్వుతూ అన్నాడు శంకరం. "పిల్ల బాగుంటే చాలుట. కట్నాల విషయంలో పట్టింపు లేమీ లేవుట. రేపు వచ్చి చూసుకుంటారుట. నచ్చితే మాత్రం తొందర్లోనే పెళ్ళి చేసేయాలిట."

"ఆc వాళ్ళకంటే తొందరగా ఉంది మనకి. కానీ ఇంతకీ అబ్బాయి ఎలా ఉన్నాడు?"

"అబ్బాయి ఎలా ఉంటేనేం, చాలా బుద్ధిమంతుడిగా ఉన్నాడు. వాళ్ళమ్మగారితో కలిసి నన్ను సాగనంపడానికి వచ్చి హఠాత్తుగా మెట్లదగ్గిర బ్రేకు వేసినట్లు ఆగిపోయాడు. నేను ఆశ్చర్యపోయి కిందికి చూస్తే ముగ్గు గీతలు కనిపించాయి. ఆవిడ నావంక గర్వంగా చూసి, 'మా అబ్బాయి నేను గీచిన గీటు దాటడయ్యా!' అని వాళ్లబ్బాయితో, 'ఫరవాలేదులే, ముగ్గులు గీత కింద లెక్కరాదు. దాటవచ్చు' అనేదాకా అతను మెట్లు దిగి రాలేదు"

వాళ్ళమ్మ వెనుకనుంచి రామలక్ష్మి, వంటింట్లోంచి సుందరి ఒక్కసారి ఫక్కు

మన్నారు. "ఇదేం చోద్యంరా, నాన్నా" అంటూ బుగ్గలు నొక్కుకోబోయిన పార్వతమ్మ సుందరి నవ్వు విని కంగారుపడి, "ఏమే, ఇంకా అన్నం వార్చుకి రాలేదుటే?" అంటూ వంటింట్లోకి పరిగెత్తింది.

ఆవిడ వెళ్లేసరికి చిమిడిపోయిన అన్నాన్నిచూస్తూ, నవ్వాపుకుంటూన్న సుందరి కనిపించింది. "అదేమిటే, అలా అన్నం చిమిడిపోతూంటే చూస్తూ ఊరుకున్నావు?" అని కసిరిందావిడ కోడల్ని. దానితో సుందరి ఈ లోకంలోకి వచ్చి తన పొరపాటు గ్రహించి నాలిక కరుచుకుంది.

"ఇదీ వరస. ఒకళ్ళకీ తెలివీ తేటా లేదు. చస్తున్నాను వీళ్ళతో వేగలేక" అంటూ పార్వతమ్మ విసుక్కుని తదుపరి కార్యక్రమానికి ఉపక్రమించింది.

పక్కనే దేవుడి తిన్నె ముందు కూర్చుని జపం చేసుకుంటున్న వెంకట్రామయ్య "నా మటుక్కు కాస్త వేరే అన్నం వండించండి. చిమిడిన అన్నం తినలేను" అనేసి మళ్ళీ జపం చేసుకోసాగారు.

ఆ మాట మీద వంట పూర్తి అయ్యేదాకా ఏవో గొణుగుతూనే ఉంది పార్వతమ్మ. వెంకట్రామయ్య మాత్రం ఇంకేమీ మాటాడలేదు. గొణగడం పార్వతమ్మకు, విని ఊరుకోవడం వెంకట్రామయ్యకు చాలాకాలంగా అలవాటు!

ఇంతకుమించి చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేకుండానే ఆ రోజు గడిచిపోయి రామలక్ష్మి ఎదురుచూస్తూన్న రేపు రానే వచ్చేసింది.

రామలక్ష్మి రేపు కోసం ఎదురుచూస్తున్న మాట నిజమే కాని ఆ రేపు నిజంగా వచ్చేసరికి ఆమెలో ఏదో తెలియని కంగారు బయలుదేరింది. ఆ ఇంట్లో ఆమె ఎంతో గారాబంగా పెరిగింది. ఆమె వయస్సు పధ్నాలుగేళ్ళు. ఎవ్వరో వచ్చి తన్ను చూస్తారనేసరికి ఆమెకేదో ఇదిగా ఉంది. అన్నిటికంటే ఆమెకు వదినగారి బాధ ఎక్కువైంది. చిన్నపిల్లను చేసి సుందరి ఆమెను మరీ ఏడిపించసాగింది. ఉక్రోషంతో రామలక్ష్మికి నిజంగానే ఏడుపు వచ్చి, "అసలా అబ్బాయిని నేను చూడనే చూడను ఫో!" అనేసింది.

"నిన్నెవరు చూడమన్నారు? ఆ అబ్బాయే నిన్ను చూస్తాడు!"

"ఎలా చూస్తాడేమిటి? నేనసలా అబ్బాయికి కనిపించనే కనిపించనుగా!"

"ఎందుకు కనిపించవు? మొహం కడుక్కుని కాటుక పెట్టుకుని, మంచి పరికిణీ, జాకెట్టూ, ఓణీ వేసుకుని ఎంచక్కా ముస్తాబయి కూర్చుంటావు!" అంది సుందరి నవ్వుతూ.

"ఇదుగో వదినా, నా కేడుపు వచ్చేస్తుంది మరి!" అంటూనే కళ్ళు ఒత్తుకుంది రామలక్ష్మి.

"అవి కన్నీళ్ళు కాదు. ఆనందబాష్పాలు! అవునా?" రామలక్ష్మి మాట్లాడలేదు. కోపంగా వదినకేసి చూసింది. సుందరి ఓసారి అటూ ఇటూ చూసి, "అడిగో, రాజ గోపాలరావు!" అంది.

"అమ్మా, చూడవే!" ఈసారి రామలక్ష్మికి నిజంగానే ఏడుపు వచ్చింది. తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది. సుందరి ఇంకా

ఏమైనా అనేదేమోగానీ, అత్తగారి దగ్గిర నుంచి పిలుపు రావడంతో వంటింట్లోకి వెళ్లింది.

"ఇలా చూడమ్మా, ఆ సేమ్యాకిచిడీ ఏదో నువ్వే చేద్దూ. నే చేస్తే బాగుండదో అని వాడొకటే గోల! ఈ కాలపు వంటలేమిటో అవి నాకు రావు బాబూ!" అంది పార్వతమ్మ.

"జీడిపప్పు వెయ్యడం మరిచిపోకండ్రా. నేనూ తింటాను!" అన్నారు వెంకట్రామయ్య జపం మధ్యలోంచి.

ఆయన ప్రతి మాటకూ వేయి వ్యాఖ్యానాలు చెయ్యడం అలవాటైన పార్వతమ్మ అప్పుడు మాత్రం తీరుబడి లేక ఏమీ అనకుండా ఊరుకునేసరికి వెంకట్రామయ్య జపం మానేసి అయిదు నిముషాలు ఆశ్చర్యపడ్డారు.

సేమ్యాకిచిడీకి కావలసిన సరంజామా అంతా సమకూర్చుకున్నాక సుందరి, "భోజనాలయ్యాక చేస్తాను అత్తయ్యా. వాళ్ళు వచ్చేది రెండింటికి కదా. ఇప్పటినించే చేస్తే చల్లారిపోతుంది!" అంది.

"ఇప్పటినించీ మొదలెడితే అప్పటి కవుతుందేమో ననే భయంతోనే నిన్నిప్పుడు పిలుస్త. సరేలే, నీ ఇష్టం!" తన విసురుకు లోలోపల నవ్వుకుంటూ అంది పార్వతమ్మ. వెంకట్రామయ్య కూడా జపం మధ్యలో ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు.

"అమ్మా, నీ వంట ధ్యాస నీదే కానీ, కాస్త దాన్ని శుభ్రంగా ఉండమని చెప్పవేమిటే?" అంటూ వంటింట్లోకి వచ్చాడు శంకరం.

"దానికేముంది? నిక్షేపంలా తలంటి పోసుకుంది!"

"ఒక్కసారి చూస్తే సరి తెలుస్తుంది, అదీ దాని ఏడుపుగొట్టు ముఖమూను."

"సుందరీ, ఈ వేపుడు ముక్కలుకలుపుతూండమ్మా" అంటూ పార్వతమ్మ కూతురి దగ్గరికి వెళ్ళింది.

చిన్నప్పటినించీ కా అంటే కా, కీ అంటే కీగా పెరిగిన రామలక్ష్మికి వయస్సు వస్తూందన్న మాటేగాని చిన్నతనం ఏమాత్రం పోలేదు. ఏదైనా విషయంలో ఏడుపు మొదలెట్టిందంటే ఆమె నో దారికి తీసుకురాడానికి దేవుడితరం కాదు. దేవుడివల్ల కాని పనులు మనం మాత్రం ఏం చెయ్యగలమని పూర్వమయితే పార్వతమ్మ ఊరుకునేది కానీ ఇప్పుడలా ఎలా కుదురుతుంది? అందుకే ఆవిడ తన ప్రయత్నాన్ని మొదలుపెట్టింది.

"చూడమ్మలూ, అలా ఏడుస్తున్నావెందుకూ? ఇప్పుడు నీకేమైంది?"

"మరి, నన్నెవరికో చూపిస్తారంటూంది వదిన. నేను వెళ్ళను, చూడను" గునుస్తూ అంది రామలక్ష్మి. పార్వతమ్మ చిరుమందహాసం చేసింది. "తప్పమ్మా అలా అనొచ్చా. వాళ్ళెంతో దూరం నించి మన్ని చూడ్డానికి వస్తుంటే అలా అనొచ్చా? తప్పుకాదూ?"

"ఏమో, అదేమీ నాకు తెలీదు. నే చూడను"

"పోనీలే, నువ్వు చూడద్దుకానీ మాతోపాటే సరదాగా వచ్చి మండువాలో కూర్చుండువుగాని. ఏమమ్మా!"

"నే రాను. మీరు పోయి కూర్చోండి. కావలిస్తే."

"మా రామలక్ష్మి బంగారు తల్లి. చెప్పినమాట ఎంచక్కా వింటుంది. ఒక్క ఐదు

నిముషాలంటే ఐదు నిముషాలు మండువాలో కూర్చుంటుంది కదమ్మా!"

ప్రపంచంలో దేనికయినా లొంగనివారుంటారు గానీ, కాకా అనబడే పొగడ్తకు లొంగని వారుండరు. మనిషి నిద్రకు లొంగిపోవడం ఎంత సహజమో, కాకాకు లొంగి పోవడం కూడా అంత సహజమూ అని చాలామంది అభిప్రాయం. హైస్కూల్లో తెలుగు పండితుడుగా రిటైరయిన వెంకట్రామయ్య అర్ధాంగి పార్వతమ్మకు ఆ మాత్రం రహస్యం తెలియకపోలేదు. అనుభవం తనకిచ్చిన నేర్పుతో ఆమె కూతురిని మెల్లిగా ఓ దారికి తీసుకువచ్చింది. ఆవిడ కాకాలో రామలక్ష్మి పడిపోయింది. రామలక్ష్మి ఓసారి మాటిస్తే దానికి తిరుగుండదని తెలిసిన పార్వతమ్మ హమ్మయ్య అని నిట్టూర్చింది.

వేపుడుముక్కలు దింపేసిన సుందరి అలా పోతూ ఓసారి రామలక్ష్మి ఉన్న గదివైపు చూసి, "రాజగోపాలరావడుగో" అని గట్టిగా అని పక్క గదిలోకి వెళ్ళింది. అక్కడ శంకరం ఆమె చెవిపట్టుకుని, "అమ్మదొంగా, ఇదా నువ్వు చేస్తున్న పని!" అన్నాడు.

"మరి ఈ దొంగ ఏం చేస్తున్నట్లో ఇక్కడ!" అంది సుందరి నెమ్మదిగా.

ఆ సందట్లో "అమ్మా, చూడవే" అన్న రామలక్ష్మి కేకా, "ఏమిటే, నీ రాలుగాయి మాటలు?" అన్న అత్తగారి మందలింపూ సుందరి వినలేదు.

రెండు గంటల ఇరవై నిముషాలకు పెళ్ళివారు వచ్చారు. శంకరం ఎందుకైనా మంచిది, ఇంటి ముందు ముగ్గులు పెట్టవద్దంటే పార్వతమ్మ నిజమే అనుకుని మానేసింది కూడా. పెళ్ళి కొడుకూ, తల్లీ, తండ్రీ ముగ్గురే వచ్చారు.

"రండి, రండి" అంటూ వెంకట్రామయ్యవాళ్ళని ఆహ్వానించారు. హలో అంటే హలో అనుకున్నారు శంకరమూ, పెళ్ళికొడుకూను.

పెళ్ళికొడుకుని చూస్తూనే పార్వతమ్మ ముఖం వికసించింది. 'కుర్రాడు అందగాడే!' అనుకుంది ఆవిడ. ఆవిడలాగే తనూ మనసులోనే అనుకున్న సుందరి, ఆ విషయం ఆడబడుచుతో కూడా అందామని లోపలికి వెడితే, కిటికీ తలుపు కన్నాల్లోంచి మండువా లోకి చూడ్డానికి ప్రయత్నిస్తోన్న రామలక్ష్మి ఆమెకు దొరికిపోయింది!

"అమ్మదొంగా, అలా చూద్దామనుకుంటున్నావేం? అదేం కుదరదు. అక్కడ చూడవలసిందే, అతని ఎదురుగా!"

సిగ్గూ, అభిమానమూ కలిసిరాగా రామలక్ష్మికి నిజంగానే కళ్ళనీళ్ళ పర్యంతమైంది. "నేను చూడడం లేదు! కిటికీ తలుపులు వేస్తూంటేనూ..."

"రాజగోపాలరావు బాగానే వున్నాడు!" నెమ్మదిగా చెవిలో గొణిగింది సుందరి.

"అమ్మా, చూడవే" అనబోయి చూడడానికి వస్తూన్న అమ్మను చూసి ఆగిపోయింది రామలక్ష్మి.

"చూడు, సుందరీ! ఈ కాస్సేపు నువ్వు దాని దగ్గరే ఉండు. నేను ఫలహారాలు ప్లేట్లలో సర్ది గోపీ చేత ఇప్పిస్తాను" అని ఆవిడ హడావిడిగా వెళ్ళిపోయింది.

పాపం, రాజగోపాలరావు మండువాలో కుర్చీలో కూర్చున్నాడు. అసలే అతను మొహమాటస్థుడు. తను పెళ్ళికొడుకు హోదాలో ఇక్కడికి వచ్చానని గుర్తుకు వస్తూంటే

అతనికి మరీ సిగ్గుగా ఉంది. అప్పటికీ అతను తల్లితో చెప్పనే చెప్పాడు – "ఎందుకమ్మా, నీకు నచ్చితే నాకూ నచ్చినట్టే. నువ్వు వెళ్ళి చూసుకువస్తే సరిపోదూ?" అని.

ఆవిడ ఒప్పుకోలేదు. "పెళ్ళిచూపులన్నాక పెళ్ళి కొడుకు రావలసిందే. పైగా వాళ్ళకి నీమీదేమైనా అనుమానాలుంటే అవి తీరిపోతాయి" అంది.

మరి అతనికి తప్పలేదు. ఇక్కడ అతనికేమీ తోచడం లేదు. అతనికి వరసగా నాలుగు యుగాల్లోని పురాణపురుషులూ కనిపించారు. ఇంతలో టిఫిన్‌తో గోపీ వచ్చేసరికి, అతను "అరే, మళ్ళీ కలియుగం వచ్చేసిందే!" అనుకుని టైము చూసుకుంటే అయిదు నిముషాలు మాత్రమే గడిచాయని తెలిసింది.

వెంకట్రామయ్య తను కూడా టిఫిన్ తీసుకుంటూ, కాబోయే వియ్యంకుడితో హిందూ దేశపు వంటకాల ప్రాశస్త్యాన్ని గురించి చెబుతున్నారు. ఓ దొర తన ఇంటికి వచ్చి ఆవకాయ రుచికి ఆశ్చర్యపోయి అదేపనిగా ఆవకాయ తినేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకున్న ఉదంతాన్ని హాస్యభరితంగా చెప్పాడాయన వియ్యంకుడికి. ఆయన హాస్య భరితంగా చెప్పినట్లు గ్రహించలేకపోయిన వియ్యంకుడు నవ్వలేదు.

ఇంతలో అడుగులో అడుగు వేసుకుంటూ రామలక్ష్మి వచ్చింది, వెనకాల వదిన నడిపించగా, వియ్యపురాలు సుభద్రమ్మ పరిశీలనగా పెళ్ళికూతుర్ని చూడసాగింది. 'నడక బాగానే ఉంది. కుంటిది కాదు!' అనుకుంది ఆమె.

రామలక్ష్మి తల వంచుకుని కూర్చుంది.

"పేరేమిటమ్మా?" అంది సుభద్రమ్మ.

"రామలక్ష్మి!" అన్నాడు శంకరం.

"నిన్ను కాదయ్యా అడుగుత! నువ్వు చెప్పమ్మా!" అంది పార్వతమ్మ.

ఆ క్షణంలో రామలక్ష్మికి తల్లిమీద ఎక్కడలేని కోపమూ వచ్చేసింది. మాట్లాడదామంటే నోరు పెగల్లేదు.

"చెప్పమ్మా!" అంది సుభద్రమ్మ అనునయంగా. తల్లి ముందుండే తన వాగ్ధాటి ఏమైపోయిందో రామలక్ష్మికి అర్థం కాలేదు. ఎంత ప్రయత్నించినా నోటినుంచి మాట ఊడిపడడం లేదు. దానికి తోడు ఎక్కడ లేని వణుకూ పుట్టుకువచ్చింది ఆమెకు.

"చెప్పవే!" అంది పార్వతమ్మ.

"రామలక్ష్మి!" అంది చటుక్కున. ఏదో నూతిలోంచి వచ్చినట్లుగా ఉన్నా, ఆ మాట అందరికీ వినిపించింది.

"అమ్మయ్య మూగది కాదు!" అనుకుంది సుభద్రమ్మ. ఒళ్ళు ఝల్లుమంది రాజగోపాలరావుకి. "రామలక్ష్మి!" అని ఆమె నోటినుంచి వచ్చిన ధ్వనితరంగాలు అతని శరీరాన్ని తాకి గిలిగింతలు పెట్టాయి. ఓసారి ఆమెను చూడాలనిపించి, అంతసేపూ ఎటో చూస్తూన్నవాడల్లా, రామలక్ష్మి ఉంటుందనుకున్నవైపు తిరిగాడు. కానీ అతనికి ఎదురుగా ఏవో తెరలు తప్ప ఏమీ కనిపించలేదు. 'సిగ్గుతెరలు కాబోలు, అడ్డు వస్తున్నాయి' అనుకున్నాడు రాజగోపాలరావు.

"అమ్మాయిని చూడవేంరా?" అని సుభద్రమ్మ అనేదాకా, తను ఇందాకటినించీ చూస్తూన్నవైపు రామలక్ష్మి లేదనీ, అవి నిజంగా తెరలేననీ గ్రహించి మొహమాటపడుతూ రామలక్ష్మిని చూశాడు. అతని చూపు ఇంకా పడిందో లేదో రామలక్ష్మి లేచి వెళ్ళిపోయింది మూడు అంగల్లో.

"అదేమిటి, అబ్బాయి చూడకుండా వెళ్లిపోతూంది?" అంది సుభద్రమ్మ.

"చూశానమ్మా" అంటూ అబద్ధమాడాడు రాజగోపాలరావు.

"దానికి తగని సిగ్గు!" అంటూ సమర్థించుకుంది పార్వతమ్మ.

"ఆడవాళ్ళకి సిగ్గే కదండీ సింగారం!" అన్నారు వెంకట్రామయ్య.

తరవాతి వ్యవహారాలన్నీ చాలా త్వరగా జరిగిపోయాయి. సుభద్రమ్మకు పిల్ల నచ్చింది. సుబ్బయ్యకు భార్య మాట వేదవాక్కు. రాజగోపాలరావు తల్లితండ్రులు గీచిన గీటు దాటడు. అంచేత పిల్ల అందరికీ నచ్చింది. మళ్లీ వారం నాడు సుబ్బయ్య ఇంట్లో పెళ్ళితాంబూలం పుచ్చుకోవాలని అనుకున్నాక పెళ్ళివారు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి సుందరి రామలక్ష్మిని ఒకటే ఆట పట్టించింది. చందమామను ఆకాశంలో చూపించి, "ఈరోజు చందమామ బాగున్నాడు కదూ?" అంది.

"అవును, పున్నమి గదా!" అంది రామలక్ష్మి.

చందమామకేసి పరీక్షగా చూస్తున్నట్లు చూసి, "అరే, అదేమిటి? చందమామలోంచి రాజగోపాలరావు నవ్వుతున్నాడు!" అంది సుందరి.

"అమ్మా, చూడవే!' అంది రామలక్ష్మి.

"అమ్మ వంటింట్లో భోంచేస్తూంది. అయినా అమ్మ ఇందాకనే చూసేసిందతన్ని. ఇంక నువ్వే చూడాలి. చూసుకో!" అంటూండగా లోపలినుంచి శంకరం మంచినీళ్ళు కావాలని పిలవడంతో వెళ్ళిపోయింది సుందరి. మరి రాలేదు.

సరదాగా వారం రోజులు గడిచిపోయాయి రాజగోపాలరావుకి. చాలామంది స్నేహితులు అతన్ని అడిగారు – "అమ్మాయి ఎలా ఉంది?" అని.

చూడని ఆ అమ్మాయి అందాన్ని అతను రకరకాలుగా మెచ్చుకున్నాడు. వేర్వేరు స్నేహితులదగ్గర. "ఆ అమ్మాయిని చిదిమి దీపం పెట్టుకోవచ్చుట! వాళ్ళమ్మ గారు చెప్పారు. ఆ విషయం నిజమనడానికి మా అమ్మే ప్రబలసాక్ష్యం. కోడలి బుగ్గలు చిదిమితే ఆవిడ చేతులు కాలాయట, తెలుసా?"

"ఒకవేళ ఏ జ్వరమైనా కాసి టెంపరేచరుందేమో?" అంటూ అనుమానాన్ని వెలిబుచ్చాడో స్నేహితుడు.

"ఏడిశావులే, టెంపరేచరు లేదుగానీ, టెంపరు మాత్రం ఉన్నట్లు అనుమానంగా ఉంది. నేను పరీక్షగా చూద్దామనుకునేసరికి చటుక్కున లేచి వెళ్ళిపోయింది మరి!"

"సిగ్గేమో, పాపం!"

"ఏం సిగ్గో, ఏమిటో ఆ నా ఇంటి దీపాన్ని సరిగా చూడలేకపోయాను!" అన్నాడు రాజగోపాలరావు

ఆ రాత్రి ఎనిమిదన్నరకు రాజగోపాలరావుకి పొడుగాటి బొట్టు పెట్టారు నుదుట. కాస్సేపు పీటల మీద కూర్చోబెట్టారు. బ్రాహ్మలేవేవో మంత్రాలు చదివారు. అవేమీ రాజగోపాలరావుకి తెలియలేదు గానీ, కాబోయే మామగారు పిల్లనివ్వడానికి నిశ్చయించుకున్నామని తాంబూలాలిస్తూ ఇచ్చిన టెర్లిన్ బట్టలు మాత్రం అతన్ని ఆకర్షించాయి.

చక్కగా నలుగురి పెద్దలతో కలిసి విందుభోజనం చేశాడతను. ఆ రోజు అందరూ అతన్ని ఎక్కువగా గౌరవించారు. త్వరలోనే తనకు ప్రాముఖ్యం ఇస్తూ, తన మీద ఆధారపడబోయే ఓ అమ్మాయి వస్తుందన్న భావం లీలగా తోచి తనలో తనే ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాడు రాజగోపాలరావు.

"అప్పుడే చూశారా పెళ్లికొడుకు కళ ఎలా వచ్చేసిందో!" అని ఓ ముత్తైదువ అనగా విని, ఆ కళేమిటో చూసుకుందామని అద్దం దగ్గరికి వెళ్ళాడు రాజగోపాలరావు.

రోజులు చకచకా గడిచిపోతున్నాయి. పెళ్ళి శుభలేఖలు అచ్చయ్యాయి. అవి బంధువులందరికీ చేరాయి. ముఖ్యబంధువులు చాలామంది బయలుదేరి పెళ్ళివారింటికి చేరుకున్నారు.

ఆ రోజు రాజగోపాలరావు తలంటి నీళ్ళు పోసుకున్నాడు. కాళ్లకు పసుపు పారాణి పెట్టించుకున్నాడు. నుదుట పొడుగాటి కుంకుమబొట్టు - ఆ వేషంలో అతన్నిచూసిన తల్లి ఎంతో మురిసిపోయింది. పెళ్ళికొడుకుని చేసిన రాజగోపాలరావుని చూసి ఆశీర్వదించడానికి ఊళ్ళో ముత్తైదువల్ని పేరంటానికి పిలిచారు. అంతమంది ఆడవాళ్ళ మధ్య కూర్చోడానికి అతనికి చాలా సిగ్గనిపించింది. కానీ, తప్పదు.

అంతా తనకేసి అదోలా చూస్తూంటే, తన గురించి అంతా చెప్పుకుంటూంటే అతనిలో సిగ్గుతోపాటు ఒకవిధమైన గర్వం కూడా కలగకపోలేదు.

ఆడపెళ్ళివారి ఊరికి బంధువుల బలగంతో ఒక కంట్రాక్టు బస్సులో చేరుకున్నారు మగపెళ్ళివారు. బస్సు పొడుగునా చలాకీ సంభాషణలతో సరదాగా గడిచిపోయింది. బస్సు ప్రయాణం రెండు గంటలూ రెండు నిముషాల్లా గడిచిందని చెప్పడానికి కాబోలు, రాజగోపాలరావు వాచీ బస్సు ఎక్కాకరెండు నిముషాలు మాత్రమే తిరిగి ఆగిపోయింది.

రాజగోపాలరావు బస్సు దిగగానే బాండుమేళం ఎదురుగా వచ్చింది. వెంకట్రామయ్య వియ్యంకుడినీ, అల్లుడినీ వియ్యపురాలినీ ముక్తసరిగా కుశల ప్రశ్నలు వేసి బాండుమేళం ముందునడవగా విడిది గృహానికి నడిపించారు. విడిది గృహం చేరుకోగానే ఒక ముత్తైదువ రాజగోపాలరావుకి హారతిలాంటిది ఇచ్చి నుదుట బొట్టు పెట్టింది పొడుగ్గా.

ఎన్నడూ పెళ్ళి వేడుకలు చూడని రాజగోపాలరావుకి పెళ్ళి ఒక విచిత్రమైనదిగా కనిపించింది. ఇంతవరకూ జరిగిన హడావిడే తను మరిచిపోలేకపోతున్నాడు. ఇంకా ముందెంత తంతు ఉందో? ఇలా జరిగేపెళ్ళి తను జీవితకాలంలో మరిచిపోగలడా?

పెళ్ళంటే ఒక కొత్తమ్మాయి తన జీవితంలో ప్రవేశిస్తుందనే అతననుకున్నాడు గానీ, ఇన్నివేడుకలు జరిగి ఆమె తనజీవితంలో ప్రవేశించిన ఘడియల్ని ఎన్నడూ

మరిచిపోకుండా ఉంచుతాయని అతననుకోలేదు.

ఆ రాత్రికి అతనువేరే భోజనం చేశాడు ఒక్కడూ. మరునాటి నుంచి విచిత్రమైన తంతులన్నీ ప్రారంభమయ్యాయి.

"ఇప్పుడు నీకు స్నాతకం చేస్తున్నాము, తలంటుకోవాలి!" అంది తల్లి సుభద్రమ్మ.

ఎప్పుడూ నెల్లాళ్ళకొకసారైనా తలంటుకునే అలవాటులేని అతను, "నిన్ననేగా అంటుకున్నాను!" అన్నాడు.

సుభద్రమ్మ నవ్వి, "అప్పుడే ఎక్కడయింది! రాత్రి ఇంకోసారి కూడా అంటుకోవాలి" అంది.

మళ్ళీ రాజగోపాలరావుని పెళ్ళికొడుకుని చేశారు. ముఖానికి బొట్టూ, కళ్ళకి కాటుకా అతని కొక వింత శోభ ఇచ్చాయి. పంచెకట్టుకోవడం రాకపోవడం మూలాన, పురోహితుడతనికి సాయం చేశాడు. పంచె కట్టుకుని కండువా పైన వేసుకుని పీటల మీదకూర్చున్నాడు. అతని పక్కనే అతని తల్లీ, తండ్రి కూర్చున్నారు.

బ్రాహ్మలు చక్కగా లయబద్ధంగా శ్లోకాలు చదువుతూ అతనిచేత ఏవేవో చేయిస్తున్నారు. సుమారు ఒక గంట సేపు ఏకపాత్రాభినయం అతని చేత చేయించాక, శ్లోకాలు చదవడం ఆపి, ఓ బ్రాహ్మణుడు అతనితో అన్నాడు. "వడుగులో నీవు స్వీకరించిన బ్రహ్మచర్యాన్ని నేటితో వదిలేస్తున్నావన్నమాట"

'ఓహ్' అని రాజగోపాలరావు అనుకోబోతుండగా అతని చెవులకు కమ్మలు తగిలించారు. ఏదో మూట కట్టి భుజాన వేశారు. చేతికి కర్రా, గొడుగూ ఇచ్చి, "నువ్విప్పుడు కాశీ వెడుతున్నావు!" అన్నారు.

ఎదురుగా కనిపిస్తున్న దొడ్డిగుమ్మంకేసి చూస్తూ, "నేను కాశీ ఎందుకు వెడుతు న్నాను?" అనుకుని అటే మెల్లిగా అడుగులు వేశాడతను. పాంకోళ్ళవల్ల అడుగులు సరిగా పడలేదు. అతను తనలో తనే మననం చేసుకుంటున్నాడు, "బ్రహ్మచర్యం వదిలేసి కాశీకి ఎందుకెళ్ళాలి?" అని.

ఇంతలో అతన్ని పురోహితుడు ఆగమన్నాడు. రామలక్ష్మి అన్నయ్య శంకరం ఒక చిన్న బెల్లం ముక్కతో వచ్చి పురోహితుడు చెప్పినట్లుగా ఆ బెల్లాన్ని రాజగోపాలరావు గడ్డం కింద ఉంచి "బావా, నీకు మా చెల్లెలినిచ్చి పెళ్ళిచేస్తాము. కాశీ వెళ్లవద్దు!" అన్నాడు.

కాశీ ప్రయాణం మానేసినందుకు రాజగోపాలరావుకి జత బట్టలు ముట్టడంలో ఆశ్చర్యం లేదుకానీ తనకాశీ ప్రయాణం మానిపించినందుకు బావమరిదికి కూడా రాజగోపాలరావు ఓ జత బట్టలిచ్చాడు.

స్నాతకం అయిపోయిందన్నారు. రాజగోపాలరావు త్వరత్వరగా వెళ్ళి అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకుని ఆశ్చర్యపోయి, "ఎవరు నువ్వు?" అని అడిగాడు. ప్రతిబింబం నవ్వి "పెళ్లికొడుకునోయ్!" అంది.

పెళ్ళికొడుకు అనగానే అతనికో కొత్త విషయం గుర్తుకు వచ్చింది. పెళ్ళి పందిట్లో ఎక్కడ చూసినా "పెళ్ళికొడుకు" అనే పేరే ప్రతిధ్వనిస్తూంది. తనని అంతా పెళ్ళికొడుకనే

పిలుస్తున్నారు. పైగా తన వాళ్ళందరినీ పెళ్ళికొడుకు తల్లి, పెళ్ళికొడుకు తండ్రి, పెళ్ళికొడుకు చెల్లెలు, పెళ్ళికొడుకు స్నేహితుడు - ఇలా వరసలు కట్టి పిలుస్తున్నారుకానీ, ఎవరినీ వారి వారి పేర్లతో పిలవడం లేదు.

"పెళ్ళి అంటే ఒక వ్యక్తి వ్యక్తిత్వం నాశనం కావడమా?" అనుకున్నాడతను. 'కాదు, ఒక కొత్త వ్యక్తిత్వం రావడం!' అని సమాధానం వచ్చింది.

ఆ పూట అతనికి భోజనమే లేదు. కొద్దిగా ఫలహారం పంపించారు తినమని. అతనికి అదీ సయించలేదు.

పెళ్ళిముహూర్తం ఇంక రెండు గంటల్లో ఉందనగా అతన్ని బాండుమేళంతో ఆడపెళ్ళివారింటికి తీసుకువెళ్ళారు విడిదినించి. అక్కడ అతన్ని మామగారు ఓ జత బట్టలతో సత్కరించాక మంగళస్నానమనే పేరుతో అతన్ని మళ్ళీ అభ్యంగనస్నానం చేయించారు. తరువాత పట్టు పీతాంబరాలు (మామగారు పెట్టినవి) ధరించి అతను పీటల మీద కూర్చున్నాడు. తరువాత అతను చాలా చిత్రాలు చూశాడు.

పెళ్ళికూతురును ఓ బుట్టలో కూర్చోపెట్టి తీసుకువచ్చారు. ఆమె ముఖం కనపడకుండా ఆమెకూ, తనకూ మధ్య ఓ తెర పెట్టి పురోహితులు మంత్రాలు చదవడం మొదలుపెట్టారు. అంతవరకూ రామలక్ష్మిని చూడని రాజగోపాలరావుకి ఆమెను చూడాలని పదే పదే అనిపించసాగింది. కానీ కొన్నివేల జతల కళ్ళు తనమీదనే కేంద్రీకరింపబడి ఉన్నాయని గుర్తు వచ్చేసరికి అతనికే సిగ్గువేసి మానేశాడు.

పురోహితులు ఎన్నో మంత్రాలు చదివారు. తనకు తెలియకుండానే ఏవేవో చేశాడు రాజగోపాలరావు. చివరికి మామగారు అతని కాళ్ళు కడిగి కన్యను సమర్పించినట్లు ప్రకటించారు. ఒక్కసారి వేదఘోషతో పందిరి అదిరిపోయింది. తరువాత కొన్ని క్షణాల్లోనే తెర తీసేశారు.

అదే రాజగోపాలరావుకి తొలిచూపు. నలుగురూ తనను చూస్తూన్న దృష్టి లేకుండా ఆమెవంకే చూస్తున్నాడు అతను. ఆమె కూడా ఒకసారి కళ్ళెత్తి అతని వంక చూసి మళ్లీ కళ్ళు దించుకుంది. నాలుగు కళ్ళూ కలుసుకున్నప్పుడు పొందిన ఆ అనుభూతి అతను జీవితంలో ఎన్నటికీ మరవలేదు. అప్పుడు వధూవరులిద్దరూ మధుపర్కాలు కట్టుకు వచ్చారు.

కానీ, తరువాత రాజగోపాలరావు బుద్ధి స్థిరంగా లేదు. అతను ఏవేవో ఆలోచిస్తూ తంతులన్నీ యాంత్రికంగా చేసేశాడు మంగళసూత్రాధారణ వరకూ.

ఆమె మెడలో మూడుముళ్ళు వేస్తున్నప్పుడు అతను పొందిన అనుభూతిని మాటల్లో ఇది అని చెప్పడం కష్టం. ఆమె నేటి నుంచి తనది, తన స్వంతం. తనకు తోడునీడగా జీవితకాలం ఉంటుంది. అతనికి తెలియకుండానే ఆమె అతని హృదయంలో స్థానాన్ని సంపాదించుకుంది.

తరవాత అతనికి సరదాగా కనిపించింది తలంబ్రాల సంబరం. ఇద్దరూ బియ్యాన్ని పోటాపోటీగా ఒకరి తలమీద ఒకరు పోసుకోవడం చాలా తమాషా అనుభవం. తన

సుకుమారమైన చిన్న చేతులతో, అంత సిగ్గుపడే రామలక్ష్మి చొరవగా తన తలమీద తలంబ్రాలు పోస్తూంటే అతనికి ముచ్చటేసి, కళ్ళప్పగించి చూస్తూ కూర్చుండిపోయాడు. అందులో ఆమె నెగ్గింది!

తరువాత హోమాలు రకరకాలవి చేశాడతను. తొలిసారిగా ఆమె చేయి పట్టుకున్నప్పుడు, ఆమె గోరువెచ్చని స్పర్శ అతనికి ఎంతో హాయి ఇచ్చింది. ఎంతసేపూ అలా పట్టుకునే ఉండిపోవాలనిపించింది.

ఓ హోమం పూర్తికాగానే బిందెలో నీళ్ళు పోసి, అందులో బంగారు ఉంగరమూ, వెండిచుట్టా కలిపి వేసి ఇద్దరినీ తియ్యమన్నారు. ఆ నీటిలో ఆమె చేయి అతనికి వెచ్చగా తగిలి అతను పరవశించిపోయాడు. ఆమె సులభంగా బంగారు ఉంగరాన్ని తీసేసింది. ఈసారి రాజగోపాలరావుకి తనే నెగ్గాలనిపించింది. మళ్ళీ వేసి వాళ్ళని మళ్ళీ తీయమన్నారు. "అల్లుడా, ఉంగరం దొరక్కపోతే మా అమ్మాయి చేయిమాత్రం గిల్లకు" అంటూ ఓ ముత్తైదువ పరాచకాలాడింది. "దొంగాడా, కరవకురా!" అన్న సామెతను గుర్తుంచుకుని, రాజగోపాలరావు ఈసారి బంగారు ఉంగరం పట్టుకున్న ఆమె వేలిని గిల్లి, తనే బంగారు ఉంగరం తీశాడు. చిన్నగా రామలక్ష్మి నవ్వుకోడం అతనికి కనిపించింది. మూడోసారి అతను నెమ్మదిగా గిల్లినా ఆమె ఉంగరాన్ని వదల్లేదు. గట్టిగా గిల్లడానికి మనసొప్పక పోనీలే అని వదిలేశాడతను, ఎలాగైనా బంగారం విషయంలో ఆడవాళ్ళు గట్టివాళ్ళే అనుకుంటూ.

తరవాత ఒక హోమంలో రామలక్ష్మి చేత చిన్నగిన్నెలో అన్నం వండించారు హోమంలో వెయ్యడానికి. ఆమె పోసిన నీళ్ళు, ఆ కొద్ది బియ్యానికి సరిపోకపోవడంతో ఆమెకు బహుశా వంట రాదని అనుకున్నాడతను.

తరవాత అలకపాన్పు! ఇది మరీ తమాషాగా ఉంది. ఇద్దర్నీ ఒక మంచం మీద ఎదురెదురుగా కూర్చోపెట్టి, వసంతం చల్లుకోమని, బుక్కా చల్లుకోమనీ, గంధం ఒకళ్ళకొకళ్ళు రాసుకోమనీ చెప్పి, అమ్మాయి కొరికిన కిళ్ళీ అబ్బాయికి, అబ్బాయి కొరికిన కిళ్ళీ అమ్మాయికీ ఇచ్చి తినిపించారు. అప్పటికి బాగా రాత్రి అయిపోవడం మూలాన పెళ్ళికొడుక్కు, పెళ్ళికూతురికి కూడా నిద్రవచ్చే సూచనలు కనిపించాయి. ఆ నిద్రబాధలో అతనికి అలకపాన్పు కాదు సరిగదా, అలగాలి అనే ధ్యాసలేదు. ఆ పట్టింపు కూడాఎవరికీ ఉన్నట్లు లేదు.

ఇంతలో పురోహితుడు మంచం పక్కనే వేలాడగట్టిన ఉయ్యాలలోనించి ఓ గంధపుచెక్క తీసి రామలక్ష్మి చేతికి ఇచ్చాడు. "నేను వంట చేసుకోవాలి, పిల్లాడేడుస్తున్నాడు! కాస్సేపు ఎత్తుకోండి!" అనమ్మా అన్నాడు.

రాజగోపాలరావు కుతూహలంగా ఆమెవంక చూశాడు ఏమంటుందోనని.

పాపం, ఆమె చాలా సిగ్గుపడిపోయింది. ఇలాంటి మాటలు బొమ్మల పెళ్ళిళ్ళలో చాలాసార్లు అనకపోలేదు గానీ, ఇది బొమ్మల పెళ్ళి కాదు గదా! వంచిన తల కూడా పైకెత్తకుండా ఉండిపోయింది!

"తొందరగా అనేయమ్మా" అన్నాడు పురోహితుడు. అనలేనన్నట్లుగా తల అడ్డంగా తిప్పింది ఆమె!

"అలా అంటే కుదరదు. అనాలి!" ఓ ముత్తైదువ హెచ్చరించింది. రామలక్ష్మి ఈడుగల పెళ్ళికాని ఆడపిల్లలు కొంతమంది ఆమెవంక కుతూహలంగా చూస్తున్నారు ఏమంటుందోనని.

"పోనీ, ముందు నువ్వే అనవోయ్" అన్నాడు పురోహితుడు. "నేను యూనివర్సిటీకి పోవాలి. పిల్లాడిని ఎత్తుకోడానికి తీరుబడి లేదు. నువ్వే ఎత్తుకో!" అన్నాడు రాజగోపాల రావు. కూర్చున్నవాళ్ళంతా ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

ఆఖరికి రామలక్ష్మి కూడా తన మాటలు ఎవరికీ వినిపంచనంత నెమ్మదిగా అంది. ఎంతో ఆసక్తిగా వింటున్న రాజగోపాలరావు ఒక్కడికే ఆ మాటలు వినిపించాయి. గట్టిగా అనాలని కొంతమంది ఆమెను బలవంతపెట్టారుగానీ, తనకు వినిపించిందని రాజగోపాలరావు చెప్పడంతో ఊరుకున్నారు.

అప్పుడు నిద్రలో ఉన్న రాజగోపాలరావు చెల్లెలిని లేపి తీసుకువచ్చి, "పిల్లాడిని నే నెత్తుకుంటాగానీ, అల్లుడినిస్తావా? మాడనిస్తావా?" అనిపించారు. నిద్రమత్తులో ఆమె ఏదో అంది. రామలక్ష్మి చేత ఈసారి జవాబు చెప్పించడం సులభమే అయింది.

అప్పుడిద్దర్నీ భోజనం చెయ్యమన్నారు. తెల్లవారుఝామున మూడు గంటలకు భోజనం చెయ్యడం చాలా కష్టం కాబట్టి, ఇద్దరూ కూడా శాస్త్రానికి ఎంగిలిపడి మళ్ళీ ఊరేగింపుతో విడిదిగృహానికి బయలుదేరారు. రామలక్ష్మికేదో పెద్ద మూట కట్టి వడిలో వేశారు.

విడిది ఇంట్లో ప్రవేశించేముందు ఇద్దర్నీ పేర్లు చెప్పమన్నారు. రామలక్ష్మి చెప్పడం మానేసి ఊరికే సిగ్గుపడిపోయింది. అప్పటికే ముందు రాజగోపాలరావే చెప్పాడు - "రామలక్ష్మి, నేనూ వచ్చాం. తలుపు తీయం"డని!

ఆమె సిగ్గుతో పదిహేను నిముషాల కాలాన్ని మింగేసింది. నేను చెప్పనని సిగ్గుతో ఆమె ముఖాన్ని అడ్డంగా తిప్పుతుంటే, చాల ఆసక్తిగా చూశాడతను ముచ్చటైన ఆమె ముఖం వంక, నిద్రను కూడా మరిచిపోయి.

చివరికి ఆమె అతని పేరు చెప్పింది. "రాజగోపాలరావు బావగారూ, నేనూ వచ్చాం" అంది.

ఆమె నోటితో ఉచ్చరించడం ద్వారా తన పేరుకూ, తనకూ ఏదో సార్థకత లభించినట్లనిపించిందతనికి. తన పేరు అంత బాగుంటుందని అతనెప్పుడూ అనుకోలేదు.

తరువాత విఘ్నేశ్వర పూజ చేసుకున్నాక ఇద్దరూ విడిపోయారు. అలిసిపోయిన వధూవరులిద్దరూ తమ స్థానాల్లో గాఢంగా నిద్రపోయారు, మధుర స్వప్నాల్లో తేలిపోతూ.

ఇక తరువాత చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవు. మరునాడుదయం ఇద్దరూ కలిసి ఒకే కంచంలో భోజనం చేశారు. అన్నం అమృతంలా ఉంటుందని రాజగోపాలరావుకి ఆ అనుభవం తెలిపింది.

ఆ రాత్రి.......

ప్రతి యువకుడూ, యువతీ ఎదురుచూసే తొలిరేయి....

"ఛీ, ఇది కూడా రాశారా?"

"అంత మధురమైన అనుభవాలను చెప్పకుండా, పెళ్ళిచేసుకోమంటే మాత్రం ఎవడు చేసుకుంటాడు, వసూ! ఊఁ చదువు! నువ్వు చదువుతూంటే ఈ కథ ఎంత బాగుందని!"

వసుంధర సిగ్గుతో తలవంచుకుంది. "నేను చదవలేనండీ, సిగ్గేస్తూంది!" ఆమె కంఠస్వరంలో కొంటెతనం లేకపోలేదు.

"అలా అంటే కుదరదు! చదివి తీరవలసిందే!"

"చదువుతానుగానీ, ఇంతకీ ఈ రామలక్ష్మి, రాజగోపాలరావూ ఎక్కడ దొరికారు మీకు?"

"ఎక్కడో ఏమిటి? రామలక్ష్మి నా ఎదురుగానే ఉంది. ఇక నేనే రాజగోపాలరావుని. మరి చదువు!"

వసుంధర సిగ్గుతో అలాగే ఉండిపోయింది. రాజారావు ఆమె వంక చూసి, "అసలు ఇంతవరకూ చదివాక ఏమని నీకనిపిస్తూంది, వసూ?" అని అడిగాడు.

"మీరేమీ అనుకోనంటే చెబుతాను" అంది వసుంధర.

"అనుకోను, చెప్పు!"

"అయితే ఇక్కడ కాదు, ఆ గదిలో చెబుతాను! రండి" అంటూ తమ కోసం ప్రత్యేకించబడిన ఆ గదిలోకి దారితీసింది వసుంధర.

"మరి, చెప్పుదూ"

"నాకు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనిపిస్తూంది.

రాజారావు ఉలిక్కిపడ్డాడు. "ఎవరిని?"

"ఇంకెవరిని, మిమ్మల్నే!"

"అబ్బ, సస్పెన్సుతో చంపావు!" తేలికగా నిట్టూర్చి రాజారావు అన్నాడు "మరి చదవ్వూ?"

వసుంధర అతనివంక గోముగా చూసి, "మీరింకా పూర్తిగా రాయలేదు గదా అని చదవడం లేదు. పూర్తిచేయండి" అంటూ పుస్తకాన్ని అందించింది. పుస్తకంతోపాటు ఆమె చేతిని కూడా పట్టుకున్నాడు రాజారావు.

"మరి కథ పూర్తి చేయరూ? ఆ రోజు రాత్రి..." కొంటెగా నవ్వింది వసుంధర.

"ఆ రోజు రాత్రి కోసం ఈ రోజు వదులుకోలేను. అదెప్పుడైనా రాస్తానులే!" అన్నాడు రాజారావు.

వసుంధర నవ్వుతూ ఏదో అనబోయింది కానీ, , అతను ఆమె నోటిని మూశాడు మాట్లాడకుండా – చేత్తో మాత్రం కాదు. తరవాత తెలుసుకోవలంటే పెళ్ళి చేసుకోవలసిందే!

✦ ✦ ✦